క్లుప్తంగా

పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి

మిడ్జిల్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో డీఏలను ఉపాధ్యాయులకు వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. అలాగే అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, లక్ష్మయ్య, జానకమ్మ, రాజలక్ష్మి, శ్రీశైలం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

రాజాపూర్: అక్రమంగా ఇసుకను తయారుచేసి తరలించేందుకు యత్నిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శుక్రవారం స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలిపారు. రాయపల్లిలో తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా దుందుభీవాగు నుంచి శరత్‌కుమార్ అనే వ్యక్తి ట్రాక్టర్‌తో మట్టిని తీసుకుని కృత్రిమ ఇసుకను తయారు చేసేందుకు వెళ్తుండగా పట్టుబడినట్లు వివరించారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించామని, డ్రైవర్ శరత్‌కుమార్, ట్రాక్టర్ ఓనర్‌పై కేసునమోదు చేసినట్లు వివరించారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడికి మెడల్

జడ్చర్ల టౌన్: లయన్స్‌క్లబ్ జడ్చర్ల అధ్యక్షుడు కైలాస్ జవహర్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఫాబ్రిసియో ఒలివైరియా ద్వారా మెడల్ (ఇంటర్నేషనల్ పిన్) అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన లయన్స్‌క్లబ్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో మెడల్ అందజేశారు. ఈ మేరకు జడ్చర్ల లయన్స్‌క్లబ్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

ఈత మొక్కలు నాటాలి

కోయిల్‌కొండ: గీతకార్మికులు ఈత మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని ఎంపీడీఓ కాళప్ప సూచించారు. శుక్రవారం గార్లపహాడ్ పరిసర ప్రాంతాల్లో గీతకార్మికులతో కలిసి ఈత మొక్కలు నాటారు. ప్రభుత్వం ఉచితంగా ఈత మొక్కలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో గీత కార్మికులు శ్రీహరిగౌడ్, మల్లేష్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, నాగార్జున్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, గోపాల్‌గౌడ్, ఎంపీఓ నజీర్‌హైమద్, మాజీసర్పంచ్‌లు ఆంజనేయులు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు మేలు

స్టేషన్ మహబూబ్‌నగర్: గత రాష్ట్ర ప్రభుత్వం హామీలతో మైనార్టీలను మభ్యపెట్టిందని జిల్లా కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడు ఎండి.ఫయాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి రూ.3వేల 3కోట్లు కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్‌అలీ, మైనార్టీసెల్ రాష్ట్ర కన్వీనర్ పీర్ మహ్మద్ సాధిక్ పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా సత్యం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా అశ్విని సత్యం, ప్రధాన కార్యదర్శిగా మల్లెపల్లి నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి స్థానాలకు ఒక్కో నామినేషన్ వచ్చింది. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు.

హామీల అమలులో విఫలం

పాలమూరు: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీకే అరుణను విమర్శించే స్థాయికి తగని వారు కూడా ఎంపీ రాజీనామా చేయాలని మాట్లాడటం అతిశయోక్తి కల్గిస్తుందన్నారు. రాజీనామా చేయాల్సి వస్తే మొదట సీఎం రేవంత్‌రెడ్డి చేయాల్సి ఉంటుందన్నారు. దాదాపు రూ.36వేల కోట్లు నిధులు రాష్ట్రానికి కేంద్రం ఇస్తే, సీఎం రేవంత్ రెడ్డి గాడిద గుడ్డు అని అనడం సరికాదన్నారు. హైదరాబాద్ చుట్టూ రింగ్ రోడ్డు కోసం రూ.28వేల కోట్లు, రైల్వే అభివృద్ధికి రూ.5360కోట్లు, జీఎస్‌టీ కింద రూ.2379కోట్లు, కేంద్ర ప్రభుత్వ పద్దు కింద రూ.17165కోట్లు, గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.40కోట్లు, విపత్తు నిర్వహణ కోసం రూ.629కోట్లు, వ్యవసాయానికి రూ.1665కోట్లు, అర్బన్ డెవలప్‌మెంట్ కోసం రూ.245కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. రాములు, రాజేందర్‌రెడ్డి, రమేష్‌కుమార్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందింది. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. దేవరకద్రకు చెందిన ఎల్లమ్మ(30) శుక్రవారం రూరల్ మండలంలోని ఆల్ మదీనా కాలేజ్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై ఎల్లమ్మ తల్లి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



శాకంబరీ దేవిగా వాసవీమాత

మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాడ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీమాతకు అభిషేకం చేశారు. వివిధ రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున హాజరయ్యారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన, సహస్ర లలితా పారాయణం నిర్వహించారు. అమ్మవారి పల్లకీసేవ చేపట్టారు. **- దేవరకద్ర**



గోరింటాకుతో అలంకరణ

ఆషాడమాసం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని గోరింటాకుతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆషాడ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవటం తెలిసిందే. అదే తరహాలో అమ్మవారిని సైతం గోరింటాకుతో అలంకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **- జడ్చర్ల టౌన్**

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

మహమ్మదాబాద్: మారుమూల ప్రాంతాల్లోని గిరిజన తండాలు, చిన్న గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని ప్రజాపాలన దరఖాస్తుల పనితీరును పరిశీలించి మహమ్మదాబాద్ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం మఠంలపల్లి, ర్యాగారిపల్లి, బండమీదిపల్లి గ్రామాల్లో పాఠశాలను సందర్శించేందుకు వెళ్లారు. కాగా ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారి వెళ్లడానికి రాకపోవడంతో ఆయన అధికారులపై మండిపడ్డారు. రోడ్లను ఎందుకు ఇలా ఉంచారని కనీసం గ్రామాలకు వెళ్లడానికి కూడా రాకుండా ఉంటే ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. అక్కడి నుంచి ఎల్కిచెరువుతండా, బొట్లగడ్డతండా, ఆముదాలగడ్డతండా, బోరింగ్‌తండాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలు అదనపు గదులు, బాత్‌రూం టాయిలెట్స్ తీరును పరిశీలించారు. మూతబడిన పాఠశాలల పరిస్థితి ఏమిటి.. అక్కడ విద్యార్థులను తీసుకుని మళ్లీ పాఠశాలలు ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవన్న, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ తిరుపతయ్య, పీఆర్ఏఈ మతీన్, ఏపీఓ హరిచ్చంద్రుడు, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆముదాలగడ్డతండాలో పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

కురుమూర్తి ఆలయ అభివృద్ధికి కృషి



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, అధికారులు

చిన్నచింతకుంట: కురుమూర్తి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా మరిన్ని నిధులు మంజూరు చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆలయ ఘాట్ రోడ్ నిర్మాణానికి సంబంధించి, అదేవిధంగా చిన్నచింతకుంట ఊకచెట్టి వాగు చెక్‌డ్యాంను శుక్రవారం ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. కురుమూర్తి ఆలయం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండటం మనందరి అదృష్టం అన్నారు. ప్రస్తుతం ఘాట్ రోడ్ నిర్మాణం చేపట్టి ఆలయ సమీపంలో పార్కు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చిన్నచింతకుంట ఊకచెట్టు వాగుపై ప్రణాళికకు విరుద్ధంగా చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగేలా చేశారన్నారు. సమస్య పరిష్కరించేందుకు అధికారులతో కలిసి పరిశీలించామన్నారు. త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి అరవింద్‌కుమార్ రెడ్డి, అప్పంపల్లి సింగల్‌విండో అధ్యక్షుడు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

లింగంపల్లిలో టీబీ శిబిరం

నవాబుపేట: లింగంపల్లిలో మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం టీబీ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో టీబీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆరంభ దశలో వ్యాధిని గుర్తిస్తే పూర్తిగా నిర్మూలించే అంశాలపై ప్రజకు వివరించారు. 142 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మంది అనుమానితులకు కళ్లే పరీక్షలు చేశారు. ఎంపీహెచ్ఓ శ్రీనివాస్‌లు, శరభలింగం, బాల్‌రాజ్, వినోద్, సతోంష, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకాంక్షలు నెరవేర్చేలా బడ్జెట్

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో వాస్తవికతకు దూరంగా బడ్జెట్ ఉండేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం వాస్తవానికి అనుకూలమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. వ్యవసాయానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిచ్చి రూ.72,659 కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో నిరుపేదల ఇంటి కలలను సాకారం చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఆదివాసీ గిరిజన విభాగం అధ్యక్షుడు లింగంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాల వేడుక



రామచంద్రాపూర్‌లో పోచమ్మ బోనాల ఊరేగింపులో పోతురాజు



గాధిర్యాల్‌లో..

మహబూబ్‌నగర్ రూరల్: రామచంద్రాపూర్‌లో శుక్రవారం పోచమ్మదేవి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా పోతురాజుల విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ కాళికాదేవి దేవస్థానం వ్యవస్థాపకులు కుర్వ ఆనంద్ బిన్నీ, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు పి.నరేష్, బి.రాములు, ఆర్.వెంకటయ్య, బి.వీరన్న, బాబురావు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఆషాడమాస చివరి శుక్రవారం కావడంతో మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గాధిర్యాల్ పెద్దె ఎత్తున బోనాలతో ఊరేగింపు చేపట్టారు.

శ్రావణమాసంలో గాయత్రి మహాయజ్ఞం

జడ్చర్ల టౌన్: శ్రావణమాసం పురస్కరించుకుని ఆర్యసమాజం ఆధ్వర్యంలో ఆగస్టు 9, 10, 11 తేదీల్లో నిర్వహించే శ్రావణి త్రిదివసీయ యజుర్వేద గాయత్రి మహాయజ్ఞం కరపత్రాలను.. రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజి చైర్మన్ బి. శివకుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఆర్యసమాజం అధ్యక్షుడు నర్సింములు, కోశాధికారి బొడ్ల విజయ్‌కుమార్, మంత్రి బక్క రాజేశ్వర్, ఉపమంత్రి ధ్యాసమోని కృష్ణయ్య, సంజీవ్‌గురూజీ, చెరుకుల రాజు, మిరియాల రామకృష్ణ, వాల్మీకి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ఎం.రామ్మోహన్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్మికుల గురించి ఏళ్లుగా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. నిర్మాణాలకు ఇసుక లేని కారణంగా కార్మికులు తమ జీవితాలను కోల్పోతారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులందరికీ ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. 60 ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర నర్సింలు, ఉపాధ్యక్షుడు నర్సింహ, జిల్లా కోశాధికారి కె.నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కరపత్రం విడుదల

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న హలో మాదిగ ఛలో ఢిల్లీ కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు ఆవిష్కరించారు. ఏబీసీడీ వర్గీకరణ పరిష్కారం కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని.. సంక్షేమమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ (వార్డు నం.3) లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, టీచర్స్‌కాలనీ (వార్డు నం.8) లో, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు (వార్డు నం.15) లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వీరన్నపేట (వార్డు నం.14) లో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఆయా కాలనీలలో పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పన్నపల్లిలో బస్టాప్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు రామాంజనేయులు, వనజ, పి.నీరజ, ఎ.అంజయ్య, లతాశ్రీ, ఎంఈఓ యు.బస్వరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సైబర్ వలలో చిక్కొద్దు

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో పోలీసు సురక్ష కళా బృందం చేత మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, చదువుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్త పడాలని అన్నారు. చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. బాల్య వివాహాలను చేసుకోవద్దన్నారు. కళాజాతా సభ్యులు పాల్గొన్నారు.

కాలనీల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 11వ వార్డు పరిధిలోని భూలక్ష్మీనగర్ కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ పర్యటించారు. కాగా తమ కాలనీలో ఎక్కువగా మట్టి రోడ్లే ఉన్నాయని, వర్షాకాలం కావడంతో బురదమయంగా మారాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని వాపోయారు. ఈ సమస్యలను వీలైనంతవరకు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గిరిజనులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

నవాబుపేట: తెలంగాణ మంత్రి వర్గంలో గిరిజనులకు స్థానం కల్పించాలని.. నాయకులు నీల్యానాయక్, భాస్కర్‌నాయక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్లకు చెందిన యువతి మధులత చదువుకు సాయం అందించడంపై ధన్యవాదాలు తెలిపారు. గిరిజనులకు మంత్రి పదవి ఇస్తే మరింత సంతోషిస్తామని ప్రకటించారు. సంతోష్, ప్రేమ్‌కుమార్, శంకర్, వినోద్ పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా షూ పంపిణీ

జడ్చర్ల: నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే షూ కార్యక్రమాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే దాదాపు 27 వేల మంది విద్యార్థులకు ఉచితంగా షూ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేను అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రవీందర్, ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు షూ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

జడ్చర్ల టౌన్: జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలందరూ తమవంతుగా బాధ్యతగా వ్యవహరించాలని.. ఇంట్లో, పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డా. భాస్కర్‌నాయక్ పిలుపునిచ్చారు. కావేరమ్మపేటలో డ్రైడే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. సూచనలు చేశారు. జ్వరం అనిపిస్తే వెంటనే సమీపంలోని హెల్త్‌సెంటర్‌లో చికిత్స పొందాలన్నారు. అవసరమైతే రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముందు అర్బన్‌హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. పలు విషయాలపై ఆరాతీశారు. డా. మనుప్రియ వివరాలు తెలియజేశారు. డా.సుదీప్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైడే కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా. భాస్కర్‌నాయక్

మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ‘డ్రై’ డే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని మొత్తం 49 వార్డుల పరిధిలో శుక్రవారం ‘డ్రై’ డే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో నిల్వ చేసిన నీటిని పారబోయించారు. నీటిసంప్‌లను, డ్రమ్ములను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే వీధులలోని మోరీలను పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

పాతపాలమూరు బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌జాం



బ్రిడ్జి వద్ద ఆగిన వాహనాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు మలుపు వద్ద ఆర్ అండ్ బీ శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి పనులు చేపట్టారు. దీంతో ఒక వైపు నుంచే వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలుసార్లు ట్రాఫిక్‌జాం ఏర్పడింది. ఈ బ్రిడ్జికి అటు.. ఇటు వైపు కనీసం కిలో మీటరు మేర వాహనాలు ఆగిపోయాయి.

రాతి ఇసుకతోనే కాంక్రీట్ పనులు

ఇదిలాఉండగా కొత్త బ్రిడ్జి నిర్మాణానికి అడుగు భాగంలో కేవలం రాతి ఇసుక (డస్ట్), సన్నని కంకర, సిమెంట్‌తో కలిపి కాంక్రీట్ పనులు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఈ పనులకు 60 శాతం ఇసుక, 40 శాతం డస్ట్ వాడాలి. అయితే సదరు కాంట్రాక్టర్ ఇవేవీ పట్టించుకోక పోవడంతో ఈ బ్రిడ్జి నాణ్యతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కార్గిల్ యుద్ధవీరుల త్యాగాలు చిరస్మరణీయం



జడ్చర్లలో ప్రసంగిస్తున్న గణేష్ కుండే



వేములలో..

జడ్చర్ల: కార్గిల్ యుద్ధ వీరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ కుండె తెలిపారు. 25వ కార్గిల్ దివాస్‌ను పురస్కరించుకుని శుక్రవారం కావేరమ్మపేటలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, కార్యదర్శి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అడ్డాకుల: వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేస్తున్న కార్గిల్ యుద్ధవీరుడు నిరంజన్‌రావును శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. జీహెచ్ఎం రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూత్పూర్: కార్గిల్ అమరవీరులకు అన్నాసాగర్‌లోని సన్‌రైజ్ పాఠశాల విద్యార్థులు నివాళి అర్పించారు. ర్యాలీ నిర్వహించారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో శుక్రవారం ఘనంగా కార్గిల్ దివస్ నిర్వహించారు. విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ గురు రాఘవేందర్‌రెడ్డి, సాయికృష్ణ, పార్థసారథి, రవీందర్, షానవాజ్ పాల్గొన్నారు.

పత్తిలో తెగులు నివారించుకోవాలి

రాజాపూర్: వర్షాల వల్ల పత్తి పంటలో ప్యారావిల్ట్ తెగులు వచ్చే అవకాశం ఉందని దాని నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ భరత్ భూషన్ సూచించారు. శుక్రవారం మల్లేపల్లి, రాజాపూర్ శివారులో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఏఈఓ శ్రీనివాస్, రైతులు జంగయ్య, గోపాల్, శ్రీకాంత్ ఉన్నారు.